# గీతకి అటూ, ఇటూ

## విహారి

హాల్లో కూర్చుని టీ.వీ. చూస్తోంది వరలక్ష్మి. మనసు ఆ దృశ్యాలమీద లేదు.

వరలక్ష్మి మనసులో ఇప్పుడు సుజాత తిష్ట వేసుక్కూచుంది. ఆమె గురించిన ఆలోచనల సుడిలో వుంది వరలక్ష్మి.

రాత్రి సుజాత ఫోన్ చేసింది. వాళ్లాయన మళ్ళీ ఉద్యోగం మానేశాడు. ఆయనెక్కడా ఏదో ఒక ఉద్యోగంలో నిలకడగా కుదురుకోడు. రోలింగ్‌స్టోన్. అర్హతకు మించిన పెద్దపెద్ద వాటిమీద అత్యాశ. 'చూపులు నెత్తిమీద ఉంటాయి' అంటూ వుంటారు తెలిసినవాళ్ళు. చిన్న లేడీస్ స్టోర్ పెట్టుకుని బండి లాక్కొస్తోంది సుజాత. నలుగురు పిల్లలు.

స్కూల్ అడ్మిషన్ రోజులు. పెద్దపిల్ల మణి. టెన్త్ పాసైంది. చాలా మార్కులొచ్చాయి. ఆ పిల్లకి చదువుమీద ఆసక్తి ఎక్కువ. ఇంటర్‌లో చేరాలి. రెండోది తొమ్మిదికీ, ఆ తర్వాతివాడు ఏడో తరగతికీ వచ్చారు. చివరిది నాలుగు. ఈ వివరాలు చెప్పి అన్నది సుజాత, "మీకు ఫోన్ చేయక తప్పటం లేదు వదినా. మా పరిస్థితులు తెలిసినదానివి. మనసు విప్పి చెప్పుకోవటానికి నీకంటే నాకెవరున్నారు చెప్పు" అని ఫోన్‌లోనే డీలా పడింది. "మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను" అని సంసారం గొడవలూ, భర్తతో అవస్థలూ చాలాసేపు మాట్లాడింది.

"రేపు చెప్తాను సుజాతా" అని తానే ఊరడించింది.

ఫోన్ మోగింది. వరలక్ష్మి రిసీవర్ తీసింది. అవతలి నుంచి సుజాత కంఠం.

"మీ చెల్లెలు...." అంటూ ఎదురు సోఫాలో వున్న భర్త శివరావ్ కిచ్చింది రిసీవర్.

కొన్ని క్షణాలు సుజాత మాటలు విన్నాడు శివరావ్.

అతని ముఖ కవళికల్లో త్వరత్వరగా మార్పు వస్తోంది.

"నీకు ఫోన్ ఖర్చు దండగ. నన్ను కూడా మీలాగా చేస్తే గాని నీకు హాయిగా ఉండదు. మీ ఆయన్నసలు మైనర్ వెధవలా చేసింది నువ్వే. బలాదూరు మనిషి. పిల్లల్ని కనంగానే సరిగాదు. అనుభవించు. ప్రేమా దోమా అంటూ ఏడ్చీ మొత్తుకునీ కట్టుకుంటివిగా వాణ్ణి. మీ చావు మీరు

కథ

చావండి. మీకు సపోర్టివ్వటం – బూడిదలో పోసిన పన్నీరే. నా వల్ల కాదు. నేనేం చెయ్యలేను" అని ఠక్కున ఫోన్ పెట్టేశాడు.

వరలక్ష్మికి మనస్సు చివుక్కుమంది. అన్నయ్య మాటలు ములుకుల్లా గుచ్చుకుని వుంటయ్ సుజాతకి. ఎంత బాధపడిందో అనిపించింది. భర్తవైపు ఆశ్చర్యంగా చూసింది.

తనలో తనే కారాలూ మిరియాలూ నూరుతున్నాడు శివరావ్. చాలా చిరాగ్గా ఉన్నాడు. టీపాయ్ మీది పత్రికలన్నీ కలగా పులగంగా విసిరాడు. పెదవులు అదురుతుండగా, "నాకు టీ ఇవ్వు" అన్నాడు వరలక్ష్మికేసి చూడకుండానే, ఆమె నుద్దేశించే.

లేచి వెళ్ళి టీ తెచ్చిచ్చింది.

భర్త మనస్తత్వానికి వేదన కలిగింది వరలక్ష్మికి. తామేమీ అంత నిస్సహాయ స్థితిలో లేరు. ఈయన లెక్చరర్. పెద్దకొడుకు స్వామి టీచర్. అతని భార్య నళినీ టీచరే. ఇద్దరు పిల్లలు. రెండో కొడుకు సుధాకర్. బెంగుళూర్లో సాఫ్ట్‌వేర్‌లో వున్నాడు. అతని భార్యకూడా ఏదో కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్. పిల్లల్లేరు. కష్టాల్లో ఉన్నానంటే, చెల్లెల్ని అలా వదిలిస్తే ఎలా? వీలైనంత ఆదుకోవచ్చుగా. సుజాత అవసరాల్లో వుండి నోరు తెరిచి అడిగినప్పుడల్లా ఈయన ప్రవర్తన ఇంతే.....

వరలక్ష్మి ఆలోచనల్లో ఉండగానే శివరావ్ అన్నాడు, "రఘునాథం తెలుసుగదా. అతనూ ఇవ్వాళ నా పుస్తకం పరిచయం చేసేది. అతనికి నా కథ 'దైవం మానుషరూపేణా' బ్రహ్మాండంగా నచ్చింది. ఆ కథ కూడా ఈ అవార్డ్ కథల సంపుటిలో వుంది. ఇవ్వాళ అతని ప్రసంగమంతా దాని గురించే ఉండొచ్చు కూడా. అందుకే నేనూ ప్రిపేరవుతున్నా".

వరలక్ష్మి తలెత్తి శివరావ్ వైపు చూసింది. ఆయన పుస్తకం తిరగేస్తున్నాడు.

ఈ రోజు సాయంత్రం అవార్డ్ ప్రదానసభ. కథా సాహిత్యంలో శివరావ్‌కి ఒక అవార్డ్ ఇస్తున్నారు – ఏదో సాహిత్య సంస్థ వారు. సభకు వచ్చేవాళ్ళు ఎంతెంత గొప్ప గొప్పవాళ్లో వివరిస్తున్నాడు శివరావ్. ఆయన పుస్తకం ఆవిష్కరణ కూడా జరగనున్నది అదే సభలో.

ఎదురుగా కూర్చుని వింటున్నదే గానీ, వరలక్ష్మి ఆలోచన ఎక్కడో వుంది. భర్త ప్రస్తావిస్తున్న కథ గుర్తు కొచ్చింది వరలక్ష్మికి. తానూ చదివే వుందా కథ. ఒక బీద విద్యార్థికి ఒకబిచ్చగత్తె చదువు చెప్పిస్తుంది. అతను చాలా గొప్ప సైంటిస్టు అయి, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తాడు. దైవం ఆమెలా మానుషరూపంలో వచ్చి అతన్ని అంత గొప్పవాణ్ణి చేసిందని సందేశం !

పేలవంగా నవ్వుకుంది వరలక్ష్మి.

మధ్యాహ్న భోజనాలైనాయి.

ఊగుడు కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తీసుకున్నాడు శివరావ్. వంటిల్లు సర్దుకుని తానూ దీవాన్ మీద నడుం వాల్చింది వరలక్ష్మి. ఆనాటి దినపత్రికని చేతుల్లోకి తీసుకుంది.

కొద్దిసేపయింది.

శివరావ్ మొదలెట్టాడు. "ఎటు చూసినా బాధలే కురుస్తూ ఉంటాయి. వ్యధల మేఘాలే కమ్ముకుంటాయి. మనుషులకెందుకిన్ని ఇబ్బందులూ, ఇక్కట్లూ? సమాజకల్పితాలు. ఎక్కడుందీ సామాజిక న్యాయం?"

ఆగి భార్యవైపు చూసి "రచనలో క్వాలిటీ అంటే ఇలా ఉండాలి. ఆలోచనాత్మకంగా ఉన్నాయ్ కదూ

భావాలు ?" అన్నాడు.

వరలక్ష్మి అప్పటికెప్పుడో నిద్రలోకి జారు కున్న దానిలా కళ్లు మూసుకుని పడుకుని వుంది. దినపత్రిక పక్కగా కింద పడి వుంది.

శివరావ్‌కి చిరాకేసింది. "ఏమిటీ – నిద్రేనా? ఎప్పుడూ ఇంకేదో లోకంలో ఉంటావ్. చదివిన ఇంటర్ తెలివిని అంగుళం కూడా ఎదగ నీయవు" విసుక్కున్నాడు.

భర్త చిరాకూ, విసుగూ, మాటలూ – అన్నీ తెలుస్తూనే ఉన్నాయి. అస్థిమితంగా గోడవైపు తిరిగింది వరలక్ష్మి. గోడమీద ఎన్నెన్నో జ్ఞాపకాల దృశ్యాలు – స్పష్టంగా కనిపించసాగేయి.

శివరావ్ ! ఆటో రిక్షావాళ్ళతో పేచీ పడ తాడు. వాళ్ళడిగే రూపాయో, రెండో ఎక్కువని – దోపిడీ దగా గురించి లెక్చర్లిస్తాడు. పనిమనిషికి తాను ఎక్కువ జీతం ఇస్తున్నానంటాడు. ఆమె నెలకో వారం నాగాలు పెట్టినా, తామో వారం ఊళ్లో లేకున్నా – దామాషా లెక్కన డబ్బు తగ్గించనని సతాయిస్తాడు. ఏదైనా ఫంక్షన్ వస్తే కేటరర్స్ దగ్గర్నుంచీ అందరితో గీచి గీచి బేరం. వాళ్లేమో గిట్టుబాటు కాదు మహాప్రభో అని మొత్తుకోవటం. ఫ్యామిలీ ఫ్రెండ్ కూతురి పెళ్లికి వెళ్లి, యాభై రూపాయల నోటని గిఫ్ట్‌కవర్‌లో ఇచ్చి, తిరిగివస్తూ "వాడు పెట్టిన డిన్నర్‌కిది చాల్లే" అని తృణీకరింపు. పొరపాటున తానేమైనా అంటే – ఎకసెక్కేల ఉరుములూ, మెరుపులూ !

... అన్నీ నలుపు మబ్బుల మరకలు !

ఆలోచనల్లో శివరావ్ వేరు – చెప్పుకునే, రాసుకునే ఆదర్శాల్లో శివరావ్ వేరు. ప్రవర్తనలో శివరావ్ వేరు.

వ్యక్తిత్వం మీద స్ఫోటకం మచ్చల్లా ఈ రచయిత విపరీతం ఏమిటా ఇది అనిపిస్తూ వుంటుంది తనకి.

వరలక్ష్మికి గాయాలచెట్టు వడగాలి మేథకు తగిలింది. తలనొప్పిగా వుంది.

ఆ తర్వాత చాలసేపటికి – నెమ్మదిగా వరలక్ష్మి కనురెప్పలమీద వాలింది కునుకు !

✿ ✿ ✿

సాయంత్రం –

నాలుగు గంటలనుంచే హడావిడి పడసాగాడు శివరావ్. ఆరుగంటలకి సభ. తామా సమయానికి ముందే హాలు దగ్గరికి చేరుకోవాలని ఆయన నిర్ణయం. వరలక్ష్మిని చాలాసార్లు సమయపాలన గురించి హెచ్చరించాడు. విని తనపని తాను చేసుకుపోతుంది ఆమె.

ఐదయింది. శివరావ్ సిద్ధమయ్యాడు. "నీదయిందా?" అని చాలాసార్లు భార్యని అడుగుతూనే వున్నాడు.

ఐదు ఇరవైకి వరలక్ష్మి చెప్పింది, "మీరు బయల్దేరండి. నేను మరో పావుగంటలో వస్తాను"

శివరావ్ చాలా అప్‌సెట్ అయ్యాడు కానీ, ఆమెకోసం ఆ పావుగంటా ఆగనిచ్చేటట్లు లేదు, ఆయన టెన్షన్. విసుగూ, చిరాకూ, కోపం అన్నీ కలిసిన చేదు కషాయం తాగేసి, బయల్దేరి వెళ్ళిపోయాడు.

వెళ్తూ వెళ్తూ, "నిన్ను మార్చటం దేవుడి తరం కాదు" అంటూ కాళ్లు తటతటలాడిస్తూ వెళ్లిపోయాడు.

వరలక్ష్మి చాలా తాపీగా తన పనులు చేసుకుని, తయారై కూర్చుంది. ఫోన్ తీసి సుధాకర్‌కి రింగ్ చేసింది. సుధాకరే తీసుకున్నాడు.

వరలక్ష్మి మనసు ఉద్విగ్నంగా ఉన్నా, మాటల్లో ఆ ఉద్విగ్నతని చూపకుండా, నెమ్మదిగా సుజాత విషయాలు చెప్పింది. వివరంగా – ఆమె అవసరాన్ని విశదం చేసింది. "ఎంతో అభిమానం కలిగిన మనిషిరా మీ అత్త. పిల్ల చదువు వలన అడుగుతోంది" అని, శివరావ్ తన చెల్లెల్ని ఏ విధంగా తృణీకరించింది కూడా కొంచెం ఫిర్యాదు ధ్వనించే కంఠస్వరంతోనే చెప్పింది.

అంతా విని ఠక్కున అన్నాడు సుధాకర్, "నీకెందుకమ్మా ఈ తాపత్రయాలన్నీ, దారినపోయే తద్దినాలన్నీ నెత్తిన పెట్టుకుంటావ్. నువు తిన్నగా బతకవ్, మమ్మల్ని బతకనివ్వవు. నా వల్లకాదు" అని రిసీవర్‌ని పెట్టేశాడు.

వరలక్ష్మి గతుక్కుమన్నది. మనసు చివుక్కు మంది. సుధాకర్ మాటలు ఆమెని చాలా కలత పెట్టాయి. 'సుధాకర్‌ది తండ్రి స్వభావం. నన్ను ముట్టకు.... మనస్తత్వం. తన పొట్ట తన సుష్టరకం. తెలుసు. అయినా నిన్నటినుంచీ ఆలోచించి ఆలో చించి, ఆశ చావక ఫోన్ చేసినందుకు బుద్ధులు చెప్పాడు అనిపించింది. పైగా మాటల మధ్యలో ఒకసారి అన్నాడు, "అయినా ఆ పిల్ల చదివి ఎవర్నుద్ధరించా లమ్మా ఇప్పుడు?" అని.

వరలక్ష్మి లోపలి దుఃఖం పైకి పొంగుకొచ్చి కళ్ళు చెమర్చాయి. తనను తాను సంబాళించుకుని, సాహిత్యసభకి బయల్దేరింది.

✿ ✿ ✿

సాహిత్యసభ చాలా కోలాహలంగా జరిగింది.

అన్నీ భేషజపు నవ్వులూ, పెదవులపై ప్లాస్టిక్ నవ్వులూ, అరిగిపోయిన పడికట్టుపదాల వాగాడంబరం... అంతా గాలిలో, మైకుల్లో కలిసిపోయి ప్రవహించిన హిపోక్రసీ !

శివరావ్ వ్యక్తిత్వం గురించీ, ఆయన కథల ఔన్నత్యాన్ని గురించీ రఘునాథమూ ఇతరులూ చాలా మాట్లాడారు. ఆ ప్రసంగాల సారాంశం ఇదీ : మానవీయ విలువల పరిరక్షణకు అంకితమైపోయిన మహామనీషి శివరావ్, ఉత్తమ కథకుడు.

పూలదండలూ, శాలువలూ చాలా పడ్డాయి!

శివరావ్ తన ప్రతిస్పందనలోనూ చాలా చాలా చెప్పాడు. సామాజిక న్యాయం, కష్టజీవుల బాధలూ, మధ్యతరగతి కడగండ్లు – వంటి ఎన్నెన్నో పదాల్ని దొర్లించాడు. చాలా ఉద్విగ్నంగా సామాజిక సేవా బాధ్యతని గుర్తుచేసుకున్నాడు. చప్పట్లు బాగానే మ్రోగాయి.

ఆ రాత్రి –



హైదరాబాదు కళాసుబ్బారావు వేదికపై కవి సమయం, శ్రీ త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభలో పోరంకి దక్షిణామూర్తి కథల సంపుటి చంద్రవంకను ఆవిష్కరిస్తున్న పోతకూచి సాంబశివరావు. చిత్రంలో తాళ్ళపల్లి మురళీధరగౌడు, పోరంకి, కె.వి.చలం, అక్కిరాజు రమాపతిరావు, పోతుకూచి, కె.షి. అశోక్‌కుమార్, దేవరాజు మహారాజు, వేదగిరి రాంబాబు ఉన్నారు.

శివరావ్ తన సన్మానం గురించి "చాలా గొప్పగా జరిగింది కదూ? అందరూ బాగా మాట్లాడారు" అని భార్య అభిప్రాయం అడిగాడు.

గుండె అలజడిని ఎంతో సంయమనంతో సర్దుబాటు చేసుకుని, మాటలు కూడదీసుకుని అన్నది, వరలక్ష్మి, "సామాజిక న్యాయాలూ, వ్యవస్థా, వ్యక్తులూ, సేవా భావం - అవన్నీ నాకేం తెలుస్తాయండీ, పెద్ద పెద్ద విషయాలు..." అని "నేను ఇంకా చాలా ఎదగా"లని మీరే చెప్తూ వుంటారు కదా !" అన్నది.

భార్య మాటలకి అదోలా చూశాడు శివ రావ్. వాటి అర్ధమేమిటా అనీ, ఆమె ఆంతర్యమేమిటా అనీ క్షణం సేపు ఆలోచించాడు కానీ, మరుక్షణమే వాటిని పక్కకి నెట్టేశాడు.

శివరావ్ వంటి మనుషుల శుష్క ప్రియలూ, శూన్యహస్తాల వలన ప్రయోజనమేమీ లేదని నిర్ధారించుకుంది.

పక్కకి తిరిగి పడుకున్న వరలక్ష్మి - వేళ్లతో కళ్ళు తుడుచుకుంది. 'సుజాత పిల్లల చదువులు ఆగిపోకూడదు. మణి ఇంటర్‌లో చేరాలి' అని నిశ్చయంగా అనుకుంది.

స్వామీ, నళినీ కళ్లముందు మెదిలారు. ఏదో సందర్భంలో వాళ్ళన్న మాటలూ చప్పున గుర్తు కొచ్చాయి- వరలక్ష్మికి. వాళ్లు అన్నారు, "చదువు కుంటాననే వాళ్ళకి అష్టకష్టాలు పడయినా సరే మనం సహాయం చేయాలి" అని.

అవును. స్వామీ, నళినీ టీచర్స్. చదువు విలువా, సాంఘిక సేవ ఆవశ్యకతా రెండూ తెలుసు వాళ్ళకి. రేపు ఉదయం వాళ్ళతో మాట్లాడాలి అనుకుంది.

ఆ భావనే వరలక్ష్మికి కమ్మతెమ్మరలా తాకింది.

నెమ్మదిగా - ఆ తలపుల్లోనే నిద్ర పట్టింది.

✿ ✿ ✿

తెలతెలవారుతుండగానే హైదరాబాద్ వచ్చాడు స్వామి. తల్లీ తండ్రీ ఆశ్చర్యపోయారు. ఎవరో రిటైర్డ్ అయిన టీచర్ పెన్షన్ విషయంలో సహాయం చేయాల్సి అర్జంటుగా బయల్దేరి వచ్చినట్లు చెప్పాడు.

స్వామి గురించిన ఆలోచనల్లోనే రాత్రి గడిపిన వరలక్ష్మికి అతనే ఇలా రావటం ఆనందం కలిగించింది.

దైవ నిరీక్షణలంటూ ఉంటారు. ఇవే కాబోలు అనిపించింది.

కాఫీలూ, పరామర్శలూ అయినై.

ఎవరి పనులువారు తెములుచ్చుకునే సరికే ఎనిమిదయింది. శివరావ్ తన గదిలోఉన్నాడు. స్వామి వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. వరలక్ష్మీ వచ్చి కూర్చుంది. ఆమెకి చాలా ఉద్వేగంగా, ఉత్కంఠగా వుంది. తాను చెప్పబోయే విషయాన్ని ఈ కొడుకెలా తీసుకోనున్నాడో అని. నిమ్మళంగా అత్తకబుర్లు చెప్తూ, అసలు విషయాన్నీ వివరంగా చెప్పింది. సూచనప్రాయంగా తండ్రీ, సుధాకర్‌ల 'రెస్పాన్స్'ని కూడా తెలిపింది.

"బాధ్యతగా భావిస్తే ఎంతటి పనయినా బరువనిపించదమ్మా. మా పిల్లనే కాలేజీలో చేర్పిం చాల్సొస్తే అప్పోసొప్పో చేసి చేర్పించుకోమా. ఇదీ అంతే. నే చూస్తాన్లే. నీ కోడలే దీన్ని పరిష్క రిస్తుంది. నువ్వా విషయం మా కొదిలెయ్" అన్నాడు చాలా సాధారణ విషయం చెప్తున్నట్టు.

కొంతమంది వ్యక్తులు కబుర్లకి కాకుండా ఆచరణకి కట్టుబడినవాళ్లుంటారు. వాళ్లకి నెత్తుటి కన్నా చిక్కనిది - 'డబ్బు' కాదు. అంతకు మించిన మేలైన విలువ ఉంటుంది. కర్మయోగుల మాటలవి. అవెప్పుడూ చలిలో నులివేడి పారవశ్యాన్ని కలిగిస్తాయి.

అనేక భావస్పందనల మధ్య హాయిగా, నిండుగా ఊపిరి పీల్చుకుంది వరలక్ష్మి. లేచి టిఫిన్ తేవటానికి వెళ్లింది.

ఇప్పుడు మణి -స్వామీ నళినీల సంరక్షణలో ఇంటర్ చదువుకుంటోంది!! ఆమె ఇప్పుడు వాళ్ళ పెద్దమ్మాయి !!

# మనలో మనం కలబోసుకుందాం !

మళ్ళీ మనం మాట్లాడుకోవాల్సిన సందర్భం వచ్చింది. మూలాల్లోకి లోతుగా వెళ్ళిపోయిన మనం స్త్రీలుగా మళ్ళీ మాట్లాడుకోవాల్సిన సమయం వచ్చింది. ఎవరి ప్రత్యేక సమస్యలు వారికున్నా అంతరంగం అట్టడుగున మనమంతా స్త్రీలమే. తెలుగుసాహితీ లోకంలో స్త్రీవాద రచయితలు ఒక విప్లవాన్ని సృష్టించి చాలాకాలం గడిచింది. ఒక వెల్లువలా సాగిన ఆనాటి సాహిత్యం సమాజానికి కొత్తదృష్టిని, ఆలోచనలనీ కలిగించింది. స్త్రీకి సంబంధించిన అన్ని రంగాలనూ కోణాలను తడిమింది. తెలుగు సాహితీ సమాజం అంతా ఏకమై వారిపై దాడిచేసినా స్త్రీవాదులంతా ఐక్యమైన సందర్భం అది. అప్పుడు కేవలం సాహిత్యకారుల నుండే దాడి జరిగింది. కాని ప్రస్తుతం సమాజమంతా కలిసి దాడి చేస్తున్న సందర్భం ఇది.

ఈనాడు అభివృద్ధి పేరుతో జరిగే విస్థాపనలో ముందుగా నష్టపోతున్నది స్త్రీలే. అగ్రవర్ణాల అహంకారానికి, ప్రభుత్వాల నిరాదరణకు బలౌతున్నది దళిత, ఆదివాసీ స్త్రీలే. వాళ్లందరి తరపున మాట్లాడాల్సిన సమయం ఇది. ముస్లిం మైనారిటీ స్త్రీలు ఇప్పుడిప్పుడే పరదాల చాటున జరిగే మోసాల గురించి లోకానికి తెలియజేస్తున్నారు. విభిన్న వర్గాలకి చెందిన మహిళా రచయితలు ఒక వేదిక మీదకు వచ్చి కలబోసుకోవాల్సిన విషయాలు ఎన్నో వున్నాయి. సమాజంలో అతివేగంగా జరుగుతున్న ఆర్థికపరమైన మార్పులు చాపకింద నీరులా మన జీవితాల్లోకి ప్రవేశించి ఎన్నో కొత్త కొత్త సమస్యలు, ఎన్నో పాత సమస్యలను కొత్తగా ఎజెండా మీదకు తెస్తున్నాయి. స్వంతకాళ్లపై నిలబడి ఆర్థిక స్వశక్తిని సాధించినా స్త్రీకి 'విముక్తి' రాలేదన్నది రుజువైంది. నూతన అభివృద్ధి నమూనాలో స్త్రీలకు చోటు లేదు. డబ్బిచ్చి కొనుక్కునే విద్య, ఆరోగ్యం రెండూ కూడా వారి అందుబాటులో నుండి కనుమరుగైపోతున్నాయి. ప్రైవేటీకరణ పుణ్యమా అని ఉద్యోగావకాశాలూ తగ్గుతున్నాయి. ఇవీ అట్టడుగు వర్గాల స్త్రీలు ఎదుర్కొంటున్న సరికొత్త సమస్యలు. ఇవన్నీ ఐక్యంగా స్పందించాల్సిన విషయాలు. రచయితలుగా మనల్ని ఆలోచింపజేసే విషయాలు.

సాంస్కృతికంగా కూడా స్త్రీలు ఎన్నో కొత్త సమస్యలను ఎదుర్కొంటు న్నారు. జీవితానికి డబ్బు సంపాదనే ప్రధానం అయిన సందర్భంలో స్త్రీలపై లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయి. చదువు, ఉద్యోగం ఏదీ భద్రతను ఇవ్వలేకపోతోంది. పితృస్వామ్య భావజాలం కొత్త రూపాలలో దాడి చేస్తోంది. జెండర్ సమస్యని మెయిన్ స్ట్రీమ్‌లో తేవడానికి ఒక ప్రక్క నుండి ప్రయత్నాలు జరుగుతోంటే మరో ప్రక్క నుండి అత్యాచారాల సంఘటనలు పెరుగుతున్నాయి. ప్రేమోన్మాదం లాంటి కొత్త జబ్బులు పుట్టుకొస్తున్నాయి.

ఈ సందర్భంలో భిన్న వర్గాల స్త్రీవాద రచయితలు కలవాలి. కలిసి 'మనలో మనం' మాట్లాడుకోవాలి. కష్టాలు కలబోసుకోవాలి. మళ్ళీ ఉద్య మించాలి. అందుకోసమే విశాఖపట్నంలో తెలుగు రచయిత్రుల సమా వేశాన్ని 'మనలో మనం' కమిటీ ఏర్పాటు చేసింది. ఈ సమావేశం 2009 జనవరి 10,11 తేదీలలో జరుగుతుంది. మనలో మనం నిర్వహణ కమిటీ సభ్యులు దీనిని కేవలం తమ స్వంత వనరులతో నిర్వహిస్తున్నారు. ఇది కేవలం ఈ సమావేశానికే పరిమితమైన తాత్కాలిక కమిటీ మాత్రమేనన్నది గమనించాలి. మనసు విప్పి మాట్లాడుకోవడానికి రచయిత్రులందరూ ఆహ్వానితులే......

- మల్లేశ్వరి